
మెదక్ మున్సిపాలిటీ: బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి


శివ్వంపేట: నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


మెదక్ జిల్లా కేంద్రంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


మెదక్ అర్బన్: జాతీయ పతకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద

## గణతంత్రం.. త్రివర్ణ శోభితం

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- జిల్లా వ్యాప్తంగా జాతీయ జెండాను ఎగుర వేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు


చేగుంట: బ్రిలియంట్ స్కూల్‌లో జాతీయ జెండా రంగులో చిన్నారులు


మెదక్ అర్బన్: పోలీస్ జిల్లా కేంద్రంలో జాతీయ పతకాన్ని ఆవిష్కరించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ/నిజాంపేట/వెల్దుర్తి/రామాయంపేట/రామాయంపేట రూరల్/చిలిపిచెడ్/మెదక్ అర్బన్/తూప్రాన్, జనవరి 26: జిల్లా వ్యాప్తంగా 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి జెండా ఆవిష్కరించా రు. జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, రాం దాస్ చౌరస్తాలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, జిల్లా గ్రంథాలయంలో సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి జెండాను ఆవిష్కరించారు.

### సంక్షేమ పథకాలు అందజేసేందుకు కృషి: కలెక్టర్

మెదక్, జనవరి 26 (నమస్తే తెలంగాణ): పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నదని కలెక్టర్ రాహుల్‌రాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని మినీ స్టేడియంలో 76వ గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్, ఏఎస్పీ మహేందర్, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పోలీసు కవాతులో పాల్గొని గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా ప్రగతిపై వివిధ శాఖల ద్వారా అమలువుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి కలెక్టర్ వివరించారు. మహాలక్ష్మి(ఆర్టీసీ), గృహజ్యోతి, రైతుభరోసా, రైతు రుణమాఫీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రూ.500కే వంట గ్యాస్, ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఉద్యానవన పట్టుపరిశ్రమ, విద్య, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, అటవీ శాఖలపై క్లుప్తంగా వివరించారు. అనంతరం ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానముల సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద ఆధ్వర్యంలో జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు.

### చిరిగిన జెండా ఎగురవేత



వెల్దుర్తి మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో ఝాన్సీ సమయానికి రాకపోవడంతో ఏఈవో మాజిద్ జెండా ఆవిష్కరించారు. జాతీయ జెండాకు కుట్లు ఊడిపోయింది గమనించకుండనే ఎగురవేశారు. కార్యక్రమానికి వచ్చిన ఏవో తన కార్యాలయం వద్దకు కాని, జాతీయ జెండా వద్దకు కాని వెళ్లకుండా తహసీల్ కార్యాలయంలో అధికారులు, నాయకులతో చర్చించి వెళ్లిపోయారు.


నిజాంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో రాజిరెడ్డి


వెల్దుర్తిలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో భాష్యం పాఠశాల చిన్నారులు


పాపన్నపేట: ఏడుపాయల్లో వనదుర్గామాత ఆలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ఈవో చంద్రశేఖర్


రామాయంపేట: బీఆర్ఎస్ కార్యాలయం వద్ద, మున్సిపాలిటీలో జెండా ఎగురవేసిన నాయకులు

## ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవానికి రావాలని ఆహ్వానం

చేగుంట, జనవరి 26: కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయ 25వ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ హైదరాబాద్‌లోని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ జనగామ రాములుగౌడ్ కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన వెంట తూప్రాన్ మున్సిపాల్ మాజీ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్, దౌల్తాబాద్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, పలువురు ఉన్నారు.


మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాములుగౌడ్

## దుర్గమ్మకు భక్తుల ప్రత్యేక పూజలు

పాపన్నపేట, జనవరి 26: ఏడుపాయల వన దుర్గామాత సన్నిధిలో ఆదివారం భారీగా భక్తుల సందడి నెలకొన్నది. వేకువజాము నుంచే వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఈవో చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు.


పూజలందుకుంటున్న అమ్మవారు

## క్రీడాకారులకు అండగా ఉంటా..

-బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



విన్నర్ టీమ్‌కు ట్రోఫీని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట, జనవరి 26: క్రీడాకారులకు అండగా ఉంటానని బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. కల్వకుంటలో 12 రోజులుగా కంఠారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీకి హాజరై మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని, కల్వకుంట గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టోర్నీలో విన్నర్ టీం నస్కల్ క్రీడాకారులకు ట్రోఫీతో పాటు రూ.20 వేలు, రన్నర్ టీం కల్వకుంట క్రీడాకారులకు ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదును అందజేశారు. క్రీడాకారులకు మేఘన దవాఖాన సిద్దిపేట ఎండీ కె.తిరుపతిరెడ్డి క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమంలో కల్వకుంట పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, నాయకులు మాధవరెడ్డి, మావురం రాజు, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మదన్‌రావు, మాణిక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సోమ్లా, నగేశ్, బూర్గుపల్లి ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

## 29 నుంచి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలు

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 26: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు తూప్రాన్‌లో అండర్-14 బాలబాలికల రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రమేశ్ ఆదివారం తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడోత్సవాల్లో రాష్ట్రంలోని పూర్వ ఉమ్మడి పది జిల్లాల నుంచి 320 క్రీడాకారులు, 40 మంది కోచ్‌లు, మేనేజర్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. తూప్రాన్‌లోని ఒలింపియా ఇంటర్నేషనల్ స్కూల్ క్రీడా మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు వసతి, భోజనాలు, సౌకర్యాలతో పాటు మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


భారతీబాయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, జనవరి 26: బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. ఖాజాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తాళ్ల పండరిగౌడ్ భార్య మృతి చెందింది. ఆదివారం దశదిన కర్మ నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హాజరై ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండి ముందుకు సాగాలని కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చారు. అనంతరం చిన్నశంకరంపేట సహకార సంఘం చైర్మన్ అంజిరెడ్డి తల్లిని పరామర్శించారు. ఆమె వెంట మాజీ జడ్పీ మాజీ వైస్ చైర్ పర్సన్ లావణ్యారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, సింగిల్ విండో చైర్మన్ అంజి రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, యాదగిరి, నరేశ్ ఉన్నారు.

## సేవా కార్యక్రమాలు అభినందనీయం



శివ్వంపేట, జనవరి 26: మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా సేవలు అభినందనీయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తూము కృష్ణారావు అన్నారు. ఆదివారం ఉసిరికపల్లిలోని అంగన్‌వాడీకి రూ.10 వేలు విలువైన కుర్చీలు, స్టాండ్స్, చార్ట్‌లు, ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబురావు, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు వీరేశం, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సిలువేరు ఆంజనేయులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు వేణుకుమార్, సురేందర్‌రెడ్డి, శ్యాంసుందర్ ఉన్నారు.

## కాంగ్రెస్‌లో పదవుల కోసం వర్గపోరు


రేగోడ్ కాంగ్రెస్ కార్యాలయం వద్ద గొడవ పడుతున్న నాయకులు, కార్యకర్తలు

రేగోడ్, జనవరి 26: కాంగ్రెస్‌లో పదవుల కోసం వర్గపోరు మొదలైంది. అన్ని ఇతర గ్రామాలకే మండల పదవులున్నాయని రేగోడ్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వేరే గ్రామాలకు ప్రభుత్వ పథకాల ఎంపిక పైలెట్ ప్రాజెక్టుగా చేయడమేమిటని పార్టీ నాయకుల్లో ఉన్న విభేదాలు గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు దిగంబర్‌రావు జెండావిష్కరణ చేసిన తర్వాత ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా రేగోడ్ గ్రామాన్ని ఎందుకు ఎంపిక చేయదని ప్రశ్నించారు. ఎన్నోరోజుల నుంచి లోలోపల రగులుతున్న మంట ఈ రోజు జాతీయ జెండా సాక్షిగా బహిర్గతం అయ్యింది.

## ఇండ్ల మధ్య బొంద పెట్టొద్దని వాగ్వాదం


ఇరువర్గాలకు నచ్చజెప్పుతున్న సీఐ రంగకృష్ణ, ఎస్సై మధుకర్‌రెడ్డి

శివ్వంపేట, జనవరి 26: మండలంలోని గూడురులో ఓ వర్గానికి చెందిన వృద్ధుడు మృతిచెందాడు. గ్రామ నడిబొడ్డున ఇండ్ల మధ్య బొందపెట్టేందుకు ప్రయత్నించారు. వేరే వర్గం వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ స్థలం వివాదంలో ఉన్నదని, ఇక్కడ బొంద పెట్టొద్దని ఒక వర్గం వారు తెలిపారు. విషయం తెలుసుకున్న తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్సై మధుకర్‌రెడ్డి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో పరిష్కరిస్తామని సీఐ, ఎస్సై తెలిపారు.

## హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తాం

- ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలి
- ప్రొటోకాల్‌ను పాటించాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకున్న బిఆర్ఎస్ నాయకులు
- పథకాల పంపిణీలో ఇరుపార్టీల మధ్య తోపులాట


కౌడిపల్లిలో తమ పేర్లు ఎక్కడ ఉన్నాయంటూ అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు


కౌడిపల్లిలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కౌడిపల్లి, జనవరి 26: అర్హులైన ప్రతిఒక్కరికీ సక్షేమ పథకాలు అందే వరకు, ప్రభుత్వ హామీలు నెరవేర్చేవరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వెంకటాపూర్(ఆర్) గ్రామంలో నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవాన్ని అధికారులు నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే వచ్చే వరకు మంజూరు పత్రాలు పంపిణీ చేయద్దని అక్కడున్న బీఆర్ఎస్ నేతలు డీఎల్‌పీవో సాయిబాబాను విజ్ఞప్తి చేసినా వినిపించుకోకుండా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకుల మధ్య తోపులాటకు దారితీసింది. అక్కడున్న పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పినా ఫలితం కేకుండా పోయింది. అక్కడున్న అధికార పార్టీ నేతల ఒత్తిడితో డీఎల్‌పీవో లబ్ధిదారులను మైకులో పదే పదే పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. చివరకు అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే అధికారులను తాను వచ్చే వరకు ఓపికలేక పోతే ఎలా, అధికార నేతలకు వత్తాసు పలికి ఇలాచేయడం ఏంటని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేండ్లు ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఉంటూ తమ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ మీమధ్యే ఉంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను లబ్ధిదారులకు అందజేసే వరకు నిరంతరం కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో పుణ్యదాస్, ఏఈవో స్వప్న జాదవ్ పాల్గొన్నారు.

### శివ్వంపేటలో..

శివ్వంపేట, జనవరి 26 : ప్రతి గ్రామంలోని అర్హులైన వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. నర్సాపూర్ మండలంలోని ఖాజీపేట గ్రామంలో నాలుగు పథకాలకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం సంతోషకరమని, ప్రతి అర్హుడికి పథకాలు అందేవిధంగా అధికారులు పనిచేయాలన్నారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలతోనే సరిపెట్టకుండా లబ్ధి చేకూరే వరకు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, మదన్‌మోహన్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్లకు అభినందన సభ


మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లను అభినందిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- మెదక్, రామాయంపేట, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లను సన్మానించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

మెదక్ అర్బన్, జనవరి26: మున్సిపల్ కౌన్సిలర్లకు పదవీ కాలం ముగియడంతో బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. పార్టీ కార్యాలయంలో మెదక్, రామాయంపేట, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లను పూలమాలలు, శాలువాలు, మెమోంటోలు ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పదేండ్లలో కేసీఆర్ హయాంలో మున్సిపాలిటీలు, గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో గ్రామాలు, మున్సిపల్ వార్డులను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. 2014 ముందు మెదక్ మున్సిపాలిటీలో నీటి సమస్య ఉండేదని, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రూ.53 కోట్లు మంజూరు చేసుకుని, పట్టణంలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ పదేండ్లలో కౌన్సిలర్లు చేసిన సేవలను కొనియాడారు. ప్రజల పక్షాన పోరాడే పార్టీ బీఆర్ఎస్ అన్నారు. వచ్చే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతో, ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తున్నదని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు లావణ్యారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు జగపతి, రామాయంపేట, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, అశోక్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

అల్లాదుర్గం, జనవరి 26: బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన అల్లాదుర్గం గ్రామ శివారులోని పటేల్ చెరువు సమీపంలో జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అప్పాజిపల్లి గ్రామానికి చెందిన బీపేట రాములు(45) ఐబీ తండాకు చెందిన రాములు వద్ద మేకలు మేపడానికి జీతమున్నాడు. 15 రోజుల నుంచి రాములు మేకలు మేపడానికి రావడం లేదు. అతని ఆచూకీ తెలియడం లేదు. ఆదివారం గ్రామ శివారులోని కొంక రమేశ్ వ్యవసాయ క్షేత్రం వద్ద బావిలో శవమై కనిపించాడు. మృతుడి అక్క లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## భూ కబ్జా కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

చిన్నశంకరంపేట, జనవరి 26: ఇతరుల భూమిని కబ్జా చేసిన కేసులో బైండోవర్ అయిన ఇద్దరిని జైలుకు తరలించినట్లు ఎస్సై నారాయణ తెలిపారు. మండలంలోని కామారం తండాకు చెందిన హలావత్ భీమా, అతడి కుమారుడు హలవత్ రాజ్‌కుమార్ తండా శివారులోని మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేటకు చెందిన శ్రీనివాస్ స్థలాన్ని ఏడాది క్రితం ఆక్రమించుకున్నారు. ఈ విషయంలో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో తండ్రి, కుమారులను పిలిచి సర్ది చెప్పినప్పటికీ వినలేదు. దీంతో, తహసీల్దార్ ఎదుట వారిద్దరిని ఏడాది పాటు బైండోవర్ చేశారు. అయినా వారిలో ఆగస్టులో ఎలాంటి మార్పురాలేదు. దీంతో ఇరువురికి రూ.2 లక్షల చొప్పున జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష విధించాలని తహసీల్దార్ మన్నన్ ఆదేశించారు. జరిమానా కట్టలేమని వారు తెలుపడంతో ఇరువురిని జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, జనవరి 26: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట శివారులోని రాధాస్టీల్ పరిశ్రమ వాహనాల పార్కింగ్ స్థలం వద్ద జరిగింది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సంచార్ షా (35) స్థానికంగా ఉన్న పరిశ్రమలో కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 21న రాత్రి మెదక్ చేగుంట ప్రధాన రహదారిపై నడుచుకుంటూ చిన్నశంకరంపేట వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో రాధాస్టీల్ పరిశ్రమ పార్కింగ్ స్థలం వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సంచార్‌షాకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు గుళిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల అందజేత


హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ

మనోహరాబాద్, జనవరి 26: మనోహరాబాద్ పారిశుధ్య కార్మికులకు మాజీ ఎంపీటీసీ పొట్టోళ్ల లతావెంకట్‌గౌడ్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను ఆదివారం అందజేశారు. గ్రామాన్ని స్వచ్ఛతగా ఉంచడంలో పంచాయతీ కార్మికుల పాత్ర కీలకమని, సొంత నిధులతో రూ.5 లక్షల ఆరోగ్య బీమా చేయించి నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసీఫ్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## 28న జిల్లా టీఎన్జీవోస్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం

మెదక్, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 28న జిల్లా టీఎన్జీవోస్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11:00 గంటలకు మెదక్‌లోని టీఎన్జీవో భవన్‌లో జిల్లా టీఎన్జీవోస్ స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం, డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ ఉన్నందున, అన్ని వర్గాల ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.